క్లుప్తంగా

జగజ్జననీ మాతకు క్షీరాభిషేకం



అమ్మవారికి క్షీరాభిషేకం చేసేందుకు వెళ్తున్న మహిళలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని శ్రీజగజ్జననీ ఆలయ వార్షిక వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజు శుక్రవారం పలువురు భక్తులు అమ్మవారికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించారు. తర్వాత భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. దుర్గా ఫ్రెండ్స్ యూనిట్ సభ్యులు భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం ప్రదోషకాల పూజలు, హోమాలు చేశారు.

కామేశ్వరస్వామికి రుద్రాభిషేకాలు

నంద్యాల(అర్బన్): మండలంలోని పాండురంగాపురం గ్రామంలో పాండురంగస్వామి 32వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రుక్మిణి సమేత పాండురంగస్వామి ఆలయంలోని శ్రీకామేశ్వరి సమేత కామేశ్వర స్వామికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. వేదపండితులు ఆదినారాయణశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు, అర్చనలు, పారాయణాలు, హారతి, తీర్థప్రసాద వినియోగాలు నిర్వహించారు. సాయంత్రం లలిత సహస్ర నామార్చనలు, అర్చనలు, హారతి, తీర్థప్రసాద వితరణలు చేపట్టారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భరత నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది.

సాగునీటి విడుదలపై వరి రైతుల ఆందోళన

శిరివెళ్ల: కేసీ కెనాల్ కింద రబీలో మండలంలో వరిసాగు చేశారు. ప్రధానంగా మండలంలో 16, 17,18 లాక్‌ల కింద సాగైన పంట పొట్ట దశలో ఉంది. అయితే, ఈ సమయంలో నీటి విడుదల సక్రమంగా లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఇంజినీర్ అధికారులు వచ్చి 16వ లాక్ వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. యర్రగుంట్ల, వెంకటాపురం, గోవిందపల్లె రైతులు వారిని కలిసి తమ ఆవేదన వ్యక్తం చేశారు. 5 రోజుల పాటు కాల్వ అడుగంటి పంటలకు నీరు అందలేదని, ఇలా అయితే పంట చేతికి రాదని చెప్పారు. ప్రస్తుతం వస్తున్న నీటిని వంతుల ప్రకారం కాకుండా పంట పండే దాకా ఇవ్వాలని మొరపెట్టుకున్నారు.

ఓపెన్ ఇంటర్ పరీక్షలు ప్రారంభం

నంద్యాల(న్యూటౌన్): ఓపెన్ ఇంటర్ పబ్లిక్ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షల నిర్వహణకు నంద్యాలలో రెండు, డోన్‌లో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి, జిల్లా సార్వత్రిక విద్యాపీఠం సమన్వయకర్త మహబూబ్‌బేగ్ తెలిపారు. తొలి రోజు శుక్రవారం ఆయా కేంద్రాల్లో 725మంది విద్యార్థులకు గాను 663 మంది హాజరై పరీక్ష రాశారు. కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

23న ఎన్‌ఐఓసీ పరీక్ష

శిరివెళ్ల: ఈ నెల 23వ తేదీన వయోజన నిరక్షరాస్యులకు ఎన్‌ఐఓసీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వెలుగు ఏపీఎం రాజశేఖరరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వయోజన విద్య ఆధ్వర్యంలో మండలంలో 112 కేంద్రాల్లో1120 మంది నిరక్షరాస్యులకు విద్య నేర్పడం జరిగిందన్నారు. వారికి ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు వయోజనుల అనుకూల సమయాల్లో పరీక్ష నిర్వహిస్తామన్నారు. పరీక్ష అనంతరం వారికి సర్టిఫికెట్లు కూడా జారీ చేస్తామన్నారు.

ప్రారంభమైన కూచిపూడి వర్క్‌షాప్



కూచిపూడి వర్క్‌షాప్‌లో విద్యార్థినులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలో ఉన్న రామాలయంలో కూచిపూడి వర్క్‌షాప్, సెమినార్ నిర్వహించారు. నంది ఫైన్ ఆర్ట్స్ అండ్ ఆర్టిస్ట్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాట్యగురువులు డాక్టర్ పల్లంశెట్టి సురేష్, కురువ మౌనిక మాట్లాడారు. ప్రాచీన కాలం నుంచి నాట్యం కొనసాగుతోంది, ఇందుకు పురాతన దేవాలయాల్లో ఉన్న నాట్య శిల్పాలే ఉదాహరణ అన్నారు. కూచిపూడి గొప్పదనాన్ని నేటి తరానికి తెలియజేయాలని సెమినార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారం రోజుల పాటు ఈ తరగతులు కొనసాగుతాయని వెల్లడించారు.





ఎగువ అహోబిలంలో యోగానృసింహ గరుడ విమానంలో ఊరేగుతున్న ఉత్సవ మూర్తులు, సూర్యప్రభ వాహనంపై కొలువైన ప్రహ్లాదవరదుడు

అహోబిలేశుని వైభవం

అహోబిల దివ్యక్షేత్రంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శ్రీ ప్రహ్లాదవరదుడు శుక్రవారం ఉదయం హంస వాహనం, రాత్రి సూర్యప్రభ వాహనాలపై కొలువై మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు. ఎగువ అహోబిలంలో జ్వాలా నరసింహుడు ఉదయం యోగానృసింహ గరుడ వాహనం, రాత్రి హనుమంత వాహనంపై ఊరేగి భక్తులను ఆశీర్వదించారు.

– ఆళ్లగడ్డ



ప్రత్యేకాలంకరణలో ఉభయ దేవేరులతో శ్రీ జ్వాలానరసింహుడు

పెద్దమ్మ దేవరకు ముహూర్తం ఖరారు



పెద్దమ్మ దేవరపై సమావేశమైన ఆలయకమిటీ, గ్రామ పెద్దలు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన శ్రీ మూలపెద్దమ్మ అమ్మవారి దేవర నిర్వహించేందుకు శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు, డబ్ల్యూ కొత్తపల్లె, డబ్ల్యూ గోవిందిన్నె గ్రామ పెద్దలు సమావేశమయ్యారు. జూన్ 8, 9, 10 తేదీల్లో దేవర నిర్వహించేందుకు నిర్ణయించారు. మే 11 అమ్మవారికి ముడుపు కడతామని, ఏమైనా మొక్కుబడులు ఉంటే ఆలోపు చెల్లించుకోవాలని సూచించారు. ప్రతి ఐదేళ్లకు ఒక సారి జరగాల్సిన దేవర చివరిగా 2015 మే 31, జూన్ 01న నిర్వహించారు. వివిధ కారణాలతో మధ్యలో దేవరను జరపలేదు. ప్రస్తుతం 11 ఏళ్లకు జాతర చేస్తుండటంతో అత్యంత వైభవంగా జరపాలని నిర్ణయించారు.

దేశ పురోగతికి అబలల అభివృద్ధి కీలకం



లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను సన్మానించిన దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): మహిళల అభివృద్ధి దేశ పురోగతికి కీలకమని రాష్ట్ర ఐఎంఏ మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, సూరన సారస్వత సంఘం అధ్యక్షుడు డాక్టర్ గెలివి సహదేవుడు పేర్కొన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక రోటరీ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో మహిళలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు రాణించని రంగం అంటూ ఏదీ లేదని, స్త్రీలు మగవారితో సమానంగా మాత్రమే కాకుండా అంతకు మించి వివిధ రంగాల్లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఈశ్వరి బాయి, షేక్ నూరి, సునంద, అరుణ, సుమతి, హబీబా, నారాయణమ్మ, జ్యోత్స్న తదితరులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శ్యాంసుధీర్, నిజాముద్దీన్, రమేష్, నాగరాజు, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ నిధి బకాయిల వసూలు వేగవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఏరియా కో ఆర్డినేటర్ గురుస్వామి

ఉయ్యాలవాడ : స్త్రీనిధి ద్వారా పొదుపు లక్ష్మి మహిళలకు అందజేసిన రుణాల వసూళ్లను వేగవంతం చేయాలని కోవెలకుంట్ల ఏరియా కోఆర్డినేటర్ గురుస్వామి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో వీఓఏలు, గ్రామైక్య సంఘం లీడర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో స్త్రీ నిధి ద్వారా పొదుపు మహిళలకు రూ. 3 కోట్లు రుణాలు అందజేయడం జరిగిందన్నారు. రికవరీలో భాగంగా రూ. 40 లక్షలు మొండి బకాయిలు ఉన్నాయన్నారు. వీటిని త్వరితగతిన వసూలు చేయవలసిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. కార్యక్రమంలో స్త్రీనిధి మేనేజర్ అరుణ్‌కుమార్‌రెడ్డి, వెలుగు సీసీ గంగన్న పాల్గొన్నారు.


పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలకు సూచనలు చేస్తున్న జిల్లా రీసోర్స్ పర్సన్ దస్తగిరిబాషా

ఉయ్యాలవాడ : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని, ఈ విషయం ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని భాగస్వామ్యం చేయాలని జిల్లా రీ సోర్స్ పర్సన్ దస్తగిరిబాషా పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలకు సూచించారు. శుక్రవారం స్థానిక చెత్త సంపద కేంద్రంలో తయారవుతున్న వానపాములను పరిశీలించారు. తర్వాత పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలతో సమావేశమై మాట్లాడారు. గ్రామాల్లో ప్రతి ఇంటి వద్దకు వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. తర్వాత దానితో వర్మీకంపోస్టు ఎరువు తయారు చేయాలని సూచించారు. పంట సాగులో సేంద్రియ ఎరువులు వాడడం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు వీలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించండి



ఎస్సీబాలుర వసతి గృహంలో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న పంచాయతీ రాజ్ ఈఈ నాగరాజు

ఉయ్యాలవాడ : నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ఏమైనా తేడాలొస్తే చర్యలు తప్పవని పంచాయతీ రాజ్ ఈఈ నాగరాజు కాంట్రాక్టర్లను హెచ్చరించారు. శుక్రవారం ఉయ్యాలవాడ ఎస్సీ బాలుర వసతి గృహంలో రూ. 29.50 లక్షలతో జరుగుతున్న మౌలిక వసతుల పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలో చాగలమర్రి మండలం చిన్నవంగలి, శిరివెళ్ల మండలంలోని యర్రగుంట్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండల కేంద్రాల్లో ఎస్సీ బాలుర వసతి గృహాల్లో రూ. 1.18 కోట్లతో మౌలిక వసతుల నిమిత్తం మరుగుదొడ్లు, కాంపౌండ్ వాలు, గదుల్లో బండపరుపు, విద్యార్థులకు మంచినీరు తదితర సౌకర్యాల కల్పన పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ పనులన్నీ మార్చి నెలాఖరులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట డీఈ వెంకటరెడ్డి, ఏఈ వెంకటయ్య ఉన్నారు.

భ్రమరాంబాదేవికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: అష్టా దశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం అమ్మవారి మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. సాయంత్రం 7గంటలకు సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజల అనంతరం అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నందికొట్కూరుకు చెందిన సాయి నృత్య కళాశాల వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో మహాగణపతిం, నమో నమో నటరాజ, అయిగిరినందిని, శివ తాండవం తదితర గీతాలకు ఎం.అమతవర్షిణి, ఎస్. అక్షయ్య, కె.వెంకటపూజిత, ఎస్. వరలక్ష్మి, జె.రామ తులసి, బి.సర్వజ్ఞ నృత్యప్రదర్శనలు చేశారు.

క్లస్టర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు

శిరివెళ్ల: మండలంలో గ్రామ సచివాలయాల క్లస్టర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేశామని ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప తెలిపారు.శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 16 గ్రామ సచివాలయాలకు గాను 8 క్లస్టర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మండల కేంద్రం శిరివెళ్లలో 4 సచివాలయాలకు గాను రెండు, యర్రగుంట్ల 2కు గాను ఒకటి, గోవిందపల్లె 2కు గాను ఒక క్లస్టర్ ఏర్పాటు కానుందన్నారు. గుంప్రమాన్‌దిన్నె, జీనేపల్లె సచివాలయాలు ఒక క్లస్టర్‌గా, గంగవరం, బోయలకుంట్ల సచివాలయాలు మరో క్లస్టర్‌గా, మహదేవపురం, గుండంపాడు సచివాలయాలు ఇంకో క్లస్టర్‌గా ఉంటాయన్నారు. కోటపాడు, చెన్నూరు వేర్వేరు క్లస్టర్లుగా ఉంటాయన్నారు. ఈ మేరకు ప్రతి పాదనలను ఉన్నతాధికారులకు పంపినట్లు వెల్లడించారు.

'ఛావా' సినిమా రిలీజ్ చేయొద్దు

ఆళ్లగడ్డ: చరిత్రను వక్రీకరించేలా తీసిన 'ఛావా' సినిమాను రిలీజ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం డీఎస్పీ ప్రమోద్, ఉప తహసీల్దార్ రాజీవ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే ఇలాంటి సినిమాల ప్రదర్శనకు అనుమతులు లేకుండా చూడాలన్నారు

స్త్రీలు అన్ని రంగాల్లో రాణించాలి

బొమ్మలసత్రం: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శశికళారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ నేడు మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలుపుతున్నామన్నారు. రాష్ట్రంలో మహిళల రక్షణ కోసం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దిశ చట్టాన్ని, దిశ పోలీస్‌స్టేషన్‌లను ఏర్పాటు చేశారన్నారు. ప్రతి సచివాలయంలో ఒక మహిళా కానిస్టేబుల్‌ను నియమించి మహిళలకు రక్షణ కల్పించారన్నారు. ఆడపిల్లలు ఇంటికి పరిమితం కాకూడదని, వారిని తల్లిదండ్రులు చదివించేందుకు అమ్మఒడి పథకం ద్వారా సాయమందించారన్నారు. ఇలా వివిధ రూపాల్లో బాలికలు, మహిళల సంక్షేమానికి ఎంతో కృషి చేశారన్నారు.

శ్రీశైలం డ్యాం భద్రత ప్రభుత్వానిదే

నంద్యాల(న్యూటౌన్): శ్రీశైలం డ్యాం భద్రత ప్రభుత్వానిదేనని, ఈవిషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా మూల్యం చెల్లించుకోక తప్పదని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. శ్రీశైలం జలాశయం ప్లంజ్ పూల్ వద్ద 1985లో భారీ వరదలకు రాతినేల దెబ్బతిని అక్కడ భారీగా గుంత పడిందన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. నేటికీ మరమ్మతులు చేపట్టలేదన్నారు. 2009లో వచ్చిన వరదల సమయంలోనూ 120 మీటర్ల లోతున భారీ గొయ్యి ఏర్పడిందన్నారు. దీని వల్ల ప్రధాన డ్యాంకే ముప్పు ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం స్పందించకపోతే రైతులతో శ్రీశైలానికి పాదయాత్ర నిర్వహించి అక్కడే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

సోదరభావంతో మెలగాలి



ఇఫ్తార్ విందులో డీఎస్పీ ప్రమోద్

ఆళ్లగడ్డ: అన్ని మతాల సారం మనుషులంతా కలిసిమెలిసి సోదరభావంతో మెలగడమేనని ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ అన్నారు. పట్టణంలోని పాత మసీదులో శుక్రవారం ఉపవాస దీక్షపరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రమోద్ పాల్గొని మాట్లాడారు. పవిత్ర రంజాన్ మాసంలో ఇచ్చే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. అనంతరం ఆయన దీక్షపరులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇమామ్ మహమ్మద్ జాఫర్ సాధిక్, అమీర్‌బాషా ఉన్నారు

అన్నింటా మహిళలు ముందుండాలి

- అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో డీటీఓ ఐశ్వర్యారెడ్డి



బహుమతులు అందజేస్తున్న డీటీఓ ఐశ్వర్యారెడ్డి

నంద్యాల(న్యూటౌన్): అన్ని రంగాల్లో మహిళలు పురుషులతో పోటీపడుతూ ముందుండాలని నంద్యాల రవాణా శాఖ అధికారి ఐశ్వర్యారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత థీమ్‌పై విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి లక్ష్యం వైపు అడుగులు వేయాలన్నారు. పోటీపరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. సివిల్ సర్వీస్ పరీక్షలకు ప్రణాళిక ప్రకారం ప్రిపేర్‌కావాలన్నారు. అనంతరం క్విజ్ పోటీల్లో రాణించిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రామకృష్ణా విద్యాసంస్థల అధినేత రామకృష్ణారెడ్డి, ప్రొఫెసర్ విజయ కుమార్, ప్రిన్సిపాల్ సుబ్బయ్య, ప్రగతి, హేమంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జన ఔషధి కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



జనరిక్ మందుల గురించి అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: తక్కువ ధరకు మందులు లభించే ప్రధాన మంత్రి జన ఔషధి కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ప్రజలకు సూచించారు. కేంద్ర ప్రభుత్వ జన ఔషధ దివస్ సందర్భంగా శుక్రవారం పట్టణంలోని రైతునగర్‌లోని జనరిక్ మందుల దుకాణాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి జన ఔషధి కేంద్రాల ద్వారా తక్కువ ధరకే బ్రాండెడ్ కంపెనీల మందులు లభిస్తాయన్నారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ ఉన్నారు.

నకిలీ మందులు విక్రయిస్తే చర్యలు తప్పవు



మందుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ ఆర్ అశోక్‌వర్ధన్ రెడ్డి

నందికొట్కూరు: నకిలీ మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని డోన్ ఏడీఏ ఆర్.అశోక్‌వర్ధన్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ సింహాద్రి ఫర్టిలైజర్, శ్రీలక్ష్మీవెంకటేశ్వర ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్, న్యూ సుధాకర్ రెడ్డి ఫర్టిలైజ్, పెస్టిసైడ్స్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. స్టాక్ రికార్డులను పరిశీలించగా అందులో జీ2, జీ3 లేటెస్ట్ చూపించకపోవడంతో తాత్కాలికంగా అమ్మకాలను నిలిపివేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాల్లో ఎలాంటి తేడాలు వచ్చినా చర్యలు తీసుకుంటామన్నారు.

తాగునీటి సమస్య తలెత్తనివ్వొద్దు

- జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి



సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

నందికొట్కూరు: వేసవి కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి ఆదేశించారు. శుక్రవారం పట్టణ సమీపంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ మాట్లాడుతూ వేసవి కాలంలో ముందస్తుగా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నింపాలన్నారు. ప్రజలకు తాగునీటి సమస్యలు రాకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడ నీటి సమస్య వస్తే ఆ ఏరియాకు సంబంధించిన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఈఓఆర్డీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పీఎస్‌లు ఉన్నారు.

ఆది దంపతుల విహారం

మహానంది: మహానందిలో శుక్రవారం రాత్రి పల్లకి సేవ వైభవంగా జరిగింది. ఈఓ నల్లకాల్వ శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, నాగేశ్వర శర్మ, హనుమంత శర్మ, అర్చకులు ముందుగా శ్రీ కామేశ్వరీ, మహానందీశ్వర ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. అలంకార మండపంలో గణపతి పూజ, అలంకార పూజలు చేసి స్వామి, అమ్మవార్లను పల్లకిలో కొలువు చేశారు. ఆలయ ప్రాకారాల్లో స్వామివార్ల ఉత్సవం వైభవంగా జరిగింది. పలు ప్రాంతాలకు చెందిన వేలాది భక్తులు పల్లకీ ఉత్సవంలో పాల్గొన్నారు.

రిటైర్డ్ అధ్యాపకుడు వెంకటరామిరెడ్డి మృతి



నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేసి రిటైర్డ్ అయిన పట్టణంలోని ఎన్‌జీఓ కాలనీకి చెందిన వెంకటరామిరెడ్డి వృద్ధాప్య సమస్యలతో గురువారం మృతిచెందాడు. ఈయన గత కొన్నేళ్లుగా పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తూ వచ్చారు. స్కూల్, కాలేజీ ఫీజులు చెల్లించడం, నోట్ పుస్తకాలు అందజేయడం వంటివి చేశారు. దీబగుంట్లలోని జిల్లా పరిషత్ హైస్కూల్ అన్ని తరగతుల విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు, టెస్ట్ బుక్‌లు అందజేశారు. ఎన్‌జీఓ కాలనీలో మున్సిపల్ కార్మికులకు ఏటా ఉగాది పండుగకు నూతన వస్త్రాలు, బియ్యం , నిత్యావసర సరుకులు పంపిణీ చేసేవారు. పేదల సేవలో పాలుపంచుకునే వెంకటరామిరెడ్డి మృతి తీరని లోటని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.